క్లుప్తంగా

చెస్ పోటీల విజేతలకు ప్రోత్సాహకాలు



పోటీల విజేతలకు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: చైతన్య చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏయూ వేదికగా నిర్వహించిన ఓపెన్–2025 చదరంగం పోటీల విజేతలకు ప్రోత్సాహకాలు అందజేశారు. ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ తరఫున ఈ పోటీలను చైతన్య చెస్ అకాడమీ నిర్వహించింది. పోటీలో 235 మంది పాల్గొనగా, తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారు ఈ నెల 7, 8 తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర ఓపెన్–2025 చదరంగం పోటీల్లో పాల్గొంటున్నట్టు టోర్నమెంట్ డైరెక్టర్ డాక్టర్ రంగాల బాబూరావు తెలిపారు. రాష్ట్ర పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందాలని అభిలషించారు. ఈ సందర్భంగా విజేతలకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సునీత, మణికంఠ, ఆర్బిటర్స్ ఎంవీఎస్ ప్రసాద్, రవితేజ, కృష్ణ మోహన్ భార్గవ్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో ప్రజలపై రూ. 112 కోట్ల అదనపు భారం

డాబాగార్డెన్స్: 'భవన నిర్మాణాల విస్తీర్ణ కొలతలను తక్కువగా చూపుతున్నారనే సాకుతో కూటమి ప్రభుత్వం నివాస, వాణిజ్య భవనాల రీసర్వేను చేపడుతోంది. ఈ సర్వే ద్వారా ఆస్తి పన్నును కనీసం 20 శాతం పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రీసర్వేను తక్షణమే నిలిపివేయాలి అని కోరుతూ జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి. గంగారావు మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. 'ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయం అప్రజాస్వామికం. జీవీఎంసీ కౌన్సిల్ అభిప్రాయం తీసుకోకుండానే ఈ నిర్ణయం తీసుకోవడం చట్ట విరుద్ధం. ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం–1955లోని సెక్షన్ 220ఏ (1) ప్రకారం ఆస్తి పన్ను పెంపుపై నిర్ణయం తీసుకునే అధికారం జీవీఎంసీ కౌన్సిల్‌కు మాత్రమే ఉంది. ఈ సర్వే ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ. 463 కోట్లు, జీవీఎంసీలో రూ. 112 కోట్లు అదనంగా వసూలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది తగదని ఆయన తెలిపారు. విశాఖపట్నం పౌరుల ప్రయోజనాలను కాపాడే బాధ్యత జీవీఎంసీ కౌన్సిల్‌పై ఉంది అని గంగారావు వినతిపత్రంలో పేర్కొన్నారు.

పుస్తకాల నిర్వహణపై అవగాహన



పుస్తకాల జాబితాను పరిశీలిస్తున్న చిన్నారులు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహణలో భాగంగా మంగళవారం పుస్తకాల నిర్వహణపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా విద్యార్థులకు నచ్చిన కథను చెప్పించారు. అనంతరం లైబ్రరీలో పుస్తకాల వివరాలు, వాటి నిర్వహణపై లైబ్రేరియన్ పద్మజ చిన్నారులకు వివరించారు. లైబ్రరీ సైన్సు ప్రాధాన్యతను తెలిపారు. గ్రంథాలయంలోని పుస్తకాల లేబుల్స్ జాబితా తయారు చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు జి.ఎస్.ఎన్. మూర్తి యోగాలో వాయుబంధనం ద్వారా గాలిని చూడగలిగే విధానాన్ని వివరించారు. పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

జేసీని కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి



జేసీ మయూర్ అశోక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కుమార్‌రాజు

మహారాణిపేట: జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జేసీకి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల కుమార్‌రాజు కార్యదర్శిగా విధుల్లో చేరారు.

ఎక్కడి సమస్యలు అక్కడే

ఏడాది పాలన పూర్తవుతున్నా తీరని ప్రజల కష్టాలు

సాధించిందేమీ లేదని స్థానికుల నిస్పృహ

సమస్యలపై దృష్టి సారించాలని వినతి



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆర్చి



ఘోషా ఆస్పత్రి



విశాఖ పోర్టు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మక్కా మసీదు కమిటీ ప్రతినిధులు (ఫైల్)

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఇది ఎంతో పురాతనమైన ఏరియా. అందుకే ఈ ప్రాంతానికి పాతనగరం అని పేరొచ్చింది. ఇక్కడ వందేళ్లకు పైబడిన భవనాలు.. మత్స్యకార కుగ్రామం.. ప్రభుత్వ కార్యాలయాలు.. హిందూ.. ముస్లిం.. క్రిస్టియన్ ఒక్కటే అన్నట్టు మూడు కొండలపై వేంకటేశ్వరస్వామి, కొండగుడి మేరీమాత, దర్గా వంటివి ఉన్నాయి. తొలినాటి టౌన్‌గా ప్రఖ్యాతి పొందిన ఈ ప్రాంతం తర్వాత నగరం విస్తరించడంతో అభివృద్ధికి నోచుకోక అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడి సమస్యలు పరిష్కరించే ప్రజాప్రతినిధులు కరువయ్యారు. అధికారంలో ఉన్నంత వరకూ ఏవేవో ప్రకటనలు గుప్పించడం. పదవి పూర్తయిన తర్వాత మిన్నకుండడం షరా మామూలు. ఇలా గత కొన్ని దశాబ్దాలుగా జరుగుతోంది. నియోజకవర్గ ప్రధాన సమస్యలను గత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అప్పటి (గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం) ముఖ్యమంత్రి కార్యదర్శి కాల్వ ధనుంజయరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఒక్కొక్కటిగా ఆ సమస్యలు అప్పటి ప్రభుత్వం పరిష్కరిస్తూ వచ్చింది. ఇంతలో ప్రభుత్వం మారింది. అంతే.. సమస్యల సమస్యల పరిష్కారం ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైంది. ఏ ఒక్క సమస్య ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు.

ప్రధాన సమస్యలివే..

➠ 30వ వార్డు పరిధి అంగటిదిబ్బలో 2.50 ఎకరాల స్థలంలో నివాసముంటున్న సుమారు 500 కుటుంబాలకు పైగా శాశ్వత పట్టాలు మంజూరు చేసి, ముస్లిం స్మశాన వాటికకు మధురవాడ ప్రాంతంలో 10 ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. ఈ కేటాయింపు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కూటమి ప్రభుత్వం రాకముందు అప్పటి ముఖ్యమంత్రి కార్యదర్శికి వాసుపల్లి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా.. ఆ సమస్య అలానే మిగిలిపోయింది.

➠ పోర్టు కాలుష్యం పూర్తిగా నివారించేందుకు (ఐరన్ ఓర్, జిప్సమ్, సల్ఫర్, ఫెర్టిలైజర్స్, అల్యూమినా, కెమికల్ పౌడర్స్ వంటి హానికరమైనవి ప్రబలకుండా) శాశ్వత పరిష్కారం కోసం పర్మినెంట్ షెడ్స్ నిర్మించి పొల్యూషన్‌కి గురవుతున్న దక్షిణ నియోజకవర్గ ప్రజలను కాపాడాల్సి ఉంది. గత ఎమ్మెల్యే చొరవతో లక్షల సంఖ్యలో మొక్కలు నాటారు. 20 అడుగుల పైబడి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. పొల్యూషన్ మోనిటరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు కాలుష్యాన్ని నివారిస్తూ వచ్చారు. పోర్టు యాజమాన్యం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. కాలుష్యం వెదజల్లకుండా యుద్ధ ప్రాతిపదికన షెడ్లు నిర్మిస్తే సుమారు 4 లక్షల మంది ఆరోగ్యాలు కాపాడుకోవచ్చని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అప్పటి సీఎం కార్యదర్శికి వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

➠ 38వ వార్డు పరిధి రీడింగ్ రూమ్/కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రధాన ఆర్చి నుంచి బీచ్ రోడ్డు వరకు వయా ఘోషా ఆస్పత్రి రహదారిని 60 అడుగులకు విస్తరించాల్సి ఉంది. ఘోషాస్పత్రిలో నిత్యం 20 నుంచి 30 డెలివరీ కేసులు ఉంటున్నాయి. ఆస్పత్రికి వెళ్లే మార్గం చాలా చిన్నదిగా ఉండడం వల్ల చాలా ప్రసవాలు ఆటోలోనే జరిగిపోయి తల్లీ బిడ్డకు ప్రాణహాని జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ రోడ్డు విస్తరణ వల్ల సుమారు 8 వేల కుటుంబాలు (40 వేల మంది ప్రజలకు), అంతే కాక విశాఖపట్నం నలుమూలల నుంచి ప్రసవాల కోసం వస్తున్న వేలాది మంది గర్భిణులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఒక్క అడుగు ముందుకు వేయలేదు.

➠ నియోజకవర్గ పరిధి 33వ వార్డు ఏరియాలో వేంకటేశ్వరమెట్ట, 31వ వార్డు యల్లమ్మతోట ప్రాంతాల్లో నివాస గృహాల సమస్య పరిరించాలి. వేంకటేశ్వరమెట్టలో సుమారు 150 ఏళ్లుగా 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఆ గృహాలకు సంబంధించి క్రయ, విక్రయ, గిఫ్ట్ డీడ్స్ రిజిస్ట్రేషన్లకు ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. అయితే 2003లో అప్పటి ఈవో, చైర్మన్, స్థానికుల మధ్య నెలకొన్న వివాదం కారణంగా ఆయా గృహాల స్థలం దేవదాయ శాఖకు చెందినదంటూ.. వాటిపై ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి లేఖ రాయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. 2018 నుంచి 2021 వరకు 53 గృహాలకు అప్పటి ఎమ్మెల్యే వాసుపల్లి ప్రయత్నాల నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. మరలా దేవదాయ శాఖ మెలిక పెట్టడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మళ్లీ నిలిచిపోయింది. దీంతో ఆయా గృహాలపై లోన్లు రాకపోవడంతో పిల్లల విద్యా, ఉద్యోగ, వ్యాపార అవసరాలకు ఇబ్బంది పడుతున్నారు. అలాగే యల్లమ్మతోటలో 90 ఏళ్లుగా చాలా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారి ఇళ్లకు సంబంధించి కూడా దేవదాయ శాఖ మెలిక పెట్టింది. వెంటనే ఆయా సమస్యలపై చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పనులన్నీ పరిష్కార దశకు వచ్చాయి. ఇంతలో ఎన్నికలు రావడం.. ఆ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించడంతో నియోజకవర్గ సమస్యలు మళ్లీ మొదటికి వచ్చినట్టయింది. ఇప్పటికైనా దక్షిణ నియోజకవర్గ సమస్యలపై అధికారులు, నాయకులు దృష్టి సారించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్మశాన వాటిక సమస్యపై కలెక్టర్‌కు వినతి..

జీవీఎంసీ 30వ వార్డు దండుబజార్ జీవీఎంసీ హైస్కూల్ ఎదురుగా ఉన్న శ్మశాన వాటికలో కొత్త సమాధులు పూడ్చేందుకు స్థలం లేదని మక్కా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ మునీర్ గత ఏప్రిల్ నెలలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ బరియల్ గ్రౌండ్ 170 ఏళ్లుగా వినియోగంలో ఉందని, మక్కా మసీదుతో పాటు మరో నాలుగు మసీదుల పరిధిలోని ముస్లింలు మరణిస్తే ఇక్కడే ఖననం చేస్తారని, ప్రస్తుతం బరియల్ గ్రౌండ్ పూర్తిగా సమాధులతో నిండిపోవడంతో కొత్త వారిని ఖననం చేసేందుకు స్థలం లేదని, బరియల్ గ్రౌండ్ చుట్టూ ఉన్న కబ్జాదారులను తొలగిస్తే స్థలం సమస్య తీరుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లబ్ ఫుట్ డేపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పిల్లలతో కలిసి పాల్గొన్న వైద్యులు

మహారాణిపేట: ప్రపంచ క్లబ్ ఫుట్ డే అవగాహన కార్యక్రమం మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, కేజీహెచ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్స్ విభాగంలో నిర్వహించారు. సత్వర చికిత్స కేంద్రం, క్యూర్ ఇండియా ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఈ అవగాహన కార్యక్రమన్ని నిర్వహించాయి. వంకరతో జన్మించే పిల్లలను మాములుగా మార్చడం, వారికి కాస్టింగ్, టినోటమీ సర్జరీ ద్వారా వైకల్యం పూర్తిగా తొలగించడం, వారి నడకను సరిదిద్దడం వంటి కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది 70 మంది పిల్లలు ఉచితంగా లబ్ధి పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, నోడల్ అధికారి డాక్టర్ బి.హారిక, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్‌పి.శివానంద్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరసనకు తరలిరండి



మాట్లాడుతున్న శ్రీధర్



మాట్లాడుతున్న బోని శివరామకృష్ణ

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రజలకు నెరవేరని హామీలిచ్చి.. వాటిని గాలికొదిలేయడమే కాక చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలపై వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఈ నెల 4న పిలుపునిచ్చిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పార్టీ విశాఖ జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో చంద్రబాబు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. అమలు కాని హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. మహిళలకిచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకపోగా.. వారి ఆత్మాభిమానంపై దెబ్బ కొడుతున్నారని దుయ్యబట్టారు. ఏడాది పాలనలో దళితులు, మహిళలపై దాడులు పెచ్చుమీరాయని.. హోం మినిస్టర్ దళిత అయినప్పటికీ దళితులపై జరిగిన.. జరుగుతున్న దాడులపై నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లా పార్టీ నేతృత్వంలోనూ.. నియోజకవర్గాలు.. మండలాల్లో చేపట్టనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని బోని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు దేవరకొండ మార్కండేయులు, పాకా సత్యనారాయణ, కోన శంకర్, రాజుబాబు, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేయండి..

మోసపూరిత హామీలతో ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని జీవీఎంసీ 41వ వార్డు నేత కోడిగుడ్ల శ్రీధర్ ఆరోపించారు. బుధవారం నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం వార్డు కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పిలుపునిచ్చారు. జ్ఞానాపురం జంక్షన్ నుంచి పార్టీ నిర్వహించనున్న నిరసన కార్యక్రమం వరకు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం, యువతకు నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పెన్షన్ వంటి అనేక హామీలిచ్చి మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ పేరిట చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆడిన డ్రామాలు తేటతెల్లమయ్యాయని, విస్తుపోయిన ప్రజలు మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని శ్రీధర్ తెలిపారు.

చిన్నారులకు సీపీ గీతా బోధన



పిల్లలకు గీతాసారం బోధిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ



కూచిపూడిలో అద్భుత ప్రదర్శన ఇచ్చిన సంస్థ ట్యూషన్ పిల్లలను అభినందిస్తున్న సీపీ

డాబాగార్డెన్స్: పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ స్వామి వివేకానంద సంస్థ ట్యూషన్ పిల్లలకు గీతా బోధన చేశారు. భగవద్గీత శ్లోకాలు.. అర్థం.. తాత్పర్యం వివరిస్తూ పిల్లల్లో ఉత్తేజాన్ని నింపారు. స్వామి వివేకానంద సంస్థ గత నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సీనియర్ పాత్రికేయుడు వీవీ రమణమూర్తి, సంఘ సేవకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, సీహెచ్ అప్పారావు (పూడిమడక), ఎస్. తాతారావు (తిక్కవానిపాలెం), సంస్థ ట్యూషన్ మాష్టారు వాసు, నాట్యదీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్. ఇంద్రాణి నరేంద్రరెడ్డితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన పిల్లలకు, సంస్థలో నిర్వహించిన కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రతిభ కనబరిచిన పిల్లలను, భగవద్గీత శ్లోకాలు పఠించిన పిల్లలను, నిత్యం సంస్థకు సేవలందిస్తున్న సంస్థ మహిళా సభ్యులను సీపీ అభినందించి, తన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సంస్థ పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్న వాసు మాష్టారు, కూచిపూడి నృత్యం ఉచితంగా నేర్పుతున్న ఇంద్రాణి నరేంద్రరెడ్డిని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అభిలషించారు. విద్యార్థులు చెడు మార్గాల వైపు వెళ్లకుండా సివిల్స్ లక్ష్యంగా ఇప్పటి నుంచే ప్రిపేర్ కావాలని సూచించారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో చాలా బిజీగా ఉన్నప్పటికీ సంస్థ కోరిన విధంగా వేసవి శిబిరంలో పాల్గొని పిల్లలకు దిక్సూచిగా నిలిచిన సీపీని కొనియాడారు. ఇంత మంది పిల్లలకు బహుమతులు అందజేసిన సంఘ సేవకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున విద్యార్థులు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ జీడీ బాబు, విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పించిన అప్పారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు

అల్లిపురం: గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు విద్యార్థులకు పిలుపునిచ్చారు. శాఖా గ్రంథాలయంలో సోమవారం జరిగిన వేసవి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చదవడం మాకిష్టం అనే అంశంపై విద్యార్థులచే వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఓరియంటల్ ప్రోగ్రాంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గ్రంథాలయంలో గల పుస్తకాలను తమ విజ్ఞానానికి ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.వి.ఎన్. రాజు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మవారి జాతరకు పోటెత్తిన భక్తులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విశేష అలంకరణలో కొత్తమ్మవారు



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



జాతరలో ఆకట్టుకున్న వేషధారులు

అల్లిపురం: అమ్మవారివీధి వాసుల ఆరాధ్య దైవం శ్రీ కొత్తమ్మవారి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారు జాము నుంచి ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వివేకానందకాలనీ, నీలాపువారివీధి, హరిజనవీధి, అమ్మవారివీధి ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరకు అల్లిపురం, వెంకటేశ్వరమెట్ట, మెయిన్‌రోడ్డు, కర్ణాలవీధి, బంగారుమెట్ట తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సాయంత్రం అమ్మవారి తిరువీధి ఉత్సవంలో భాగంగా అమ్మవారి ప్రధాన దేవాలయం నుంచి ఘటాలు, తప్పిటగుళ్లు, పులివేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అత్యంత వైభవంగా చేపట్టారు. ఆలయ కమిటీ భక్తులకు మజ్జిగ, మంచినీళ్లు, పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు.

కనులపండువగా అమ్మవార్ల వార్షిక జాతర



45 అడుగుల భూలోకమాంబ ప్రభ ఊరేగింపు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 30, 37 వార్డుల గ్రామ దేవతలు పోలమాంబ, భూలోకమాంబ, కొత్తమాంబ, గంగమ్మ త్రైవార్షిక మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడేళ్లకోసారి నిర్వహించే ఈ ఉత్సవాలు 45 రోజుల పాటు కొనసాగనున్నాయి. గత నెల 5న కోటవీధి మదీనా సాహెబ్‌కు మొక్కులు సమర్పించి ఉత్సావాలు ప్రారంభించారు. ఇప్పటి నుంచి గంగమ్మ కోడికట్టు పండగతో పాటు కొత్త జాలారిపేట, భీమిలి, పూడిమడక, పెదజాలారిపేట, మల్కాపురం, గంగవరం తదితర 14 మత్స్యకార గ్రామాలకు చెందిన భక్తులు నిత్యం అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తూ మొక్కులు అందజేసుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పోలమాంబ, భూలోకమాంబ, కొత్తమాంబ ప్రభలను ఊరేగించారు. 45 అడుగుల ఎత్తుగల భూలోకమాంబ ప్రభను ఊరేగించారు. విద్యుత్ దీపాలంకరణతో రూపొందించిన ఓడపై కొత్తమాంబను బీచ్ రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ నుంచి రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ డౌన్‌రోడ్డు, పూర్ణామార్కెట్ మీదుగా పాత బస్టాండ్ వద్ద ఉన్న అమ్మవారి గుడి వరకు ఊరేగించారు. ఊరేగింపులో ఉత్తరాంధ్ర సాంప్రదాయ కార్యక్రమాలు, నృత్యాలు, నాగముచ్చ ఒడిశా వేషాలు, తప్పిటగుళ్లు వంటి నృత్యాలు ఏర్పాటు చేశారు. మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు (పులి), ఉపాధ్యక్షుడు కాసరపు వెంకటేశ్వరరావు, సంఘం ప్రతినిధులు పెంటయ్య, పిల్ల తాతాలు మాస్టారు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

తాటిచెట్లపాలెం: జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ పి. శివనారాయణ తమ తమ సిబ్బందితో విశాఖ రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన కాసుల మణికంఠ, రామనాతి నాగభైరవ అక్రమంగా రవాణా సుమారు రూ. 44 వేల విలువ గల 8.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా లింగంపల్లికి తరలిస్తున్నట్లు విచారణలో తెలియజేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను జీఆర్‌పీ సిబ్బందికి అప్పగించగా, నిందితులని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినటు జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు.

ఎస్సీ సబ్ ప్లాన్ ప్రాజెక్టుల టెండర్లు దళితులకే కేటాయించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న విదసం నాయకులు

సీతంపేట: రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టే ప్రాజెక్టులు, టెండర్లు దళితులకే కేటాయించాలని విస్తృత దళిత సంఘాల(విదసం) ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మంచి నీటి సరఫరా, విద్యుత్ ప్రాజెక్టులు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు అవసరమయ్యే సరకుల సరఫరా టెండర్లు దళితులకే కేటాయించాలన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో దళితుల కోసం నిర్మించే ఇళ్లు, రోడ్లు, కాలువలు, వీధి దీపాలు ఇలా ఎన్నో పనులు జరుగుతున్నా ఒక్క టెండర్ అయినా దళితులకు కేటాయించారా అని ప్రశ్నించారు. 2025–26 బడ్జెట్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్‌కు రూ.20,281కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. దీనిలో స్కూల్ ఫీజులు, అమ్మ ఒడి, సామాజిక పెన్షన్ వంటి డీబీటీ పద్దుకు రూ.9 వేల కోట్లు కేటాయించి, మిగిలిన రూ.11 వేల కోట్లలో వివిధ శాఖల ద్వారా ఎస్సీల కోసం చేపట్టే ప్రాజెక్టులు వ్యవసాయ శాఖకు రూ.1,289 కోట్లు, గ్రామీణ దళితుల అభివృద్ధికి రూ.1,144 కోట్లు, ఎస్సీల ఇళ్ల నిర్మాణానికి రూ.1,257 కోట్లు, రేషన్ పంపిణీకి రూ.1,118 కోట్లు, దళితుల ఆరోగ్యానికి రూ.1,500 కోట్లు, మంచి నీటికి రూ.562 కోట్లు, దళిత వాడల్లో అంగన్‌వాడీలకు రూ.372 కోట్లు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు అవసరమైన సరకులు, ఆహార సరఫరాకు నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ఇవన్నీ సబ్‌ప్లాన్ నిధులే అయినప్పటికీ వాటిని ఖర్చు చేసే ప్రాజెక్టులు ఏవీ దళితుల చేతుల్లో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జాజి ఓంకార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 750 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 50 రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉన్న లక్షా నాలుగు వేల మంది విద్యార్థుల భోజన తయారీకి వినియోగించే పప్పులు, నూనెలు, కూరగాయలు, గ్రుడ్లు, మాంసం సరఫరా నిమిత్తం కాంట్రాక్టర్లకు ప్రభుత్వం రూ.150 కోట్లు ఏటా చెల్లిస్తోందని, ఈ కాంట్రాక్టులు దళిత నిరుద్యోగ యువతకు కేటాయించాలన్నారు. దళితవాడల్లోని 12 వేల అంగనవాడీ కేంద్రాలకు గ్రుడ్లు, పప్పులు, నూనె, చెక్కీల సరఫరాకు రూ.150 కోట్లు కేటాయిస్తున్నారని, ఈ కాంట్రాక్టు దళితులకే ఇవ్వాలన్నారు. సమావేశంలో సోడదాసి సుధాకర్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, కె.చిన్నారావు, డి.నిర్మల, రవిశేఖర్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.